క్లుప్తంగా

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హుజూరాబాద్: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా సోమవారం నుంచి జరగనున్న పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి కేతిరి వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం ఎమ్మార్సీ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలోని ఐదు సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పట్టణంలోని న్యూ శాతవాహనలో 153 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 170 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 180 మంది రెగ్యులర్, 33 మంది ప్రైవేట్, మాంటిస్సోరిలో 144 మంది, చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 190 మంది పరీక్ష రాయనున్నారు. మొత్తం పరీక్షలకు 837 రెగ్యులర్, 33 మంది ప్రైవేట్ విద్యార్థులు హాజరుకానున్నారని, ఐదు పరీక్షా కేంద్రాలలో చీఫ్ సూపరింటెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, క్లర్క్ ఉండనున్నారు. పిల్లలను పరీక్ష కేంద్రాలకు సకాలంలో పంపించాలంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

'ఓట్లు దండుకునేందుకు మత విద్వేషాలు'

సైదాపూర్: హిందూ, ముస్లింల మధ్య మత విద్వేషాలు పెంచుతూ, హిందువుల ఓట్లు దండుకునేందుకు బీజేపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఇటీవల విడుదలైన రజాకార్ చలన చిత్రం చూడాలని ప్రజలకు బీజేపీ నాయకులు డబ్బులిచ్చి సినిమా చూపిస్తున్నారని ఆరోపించారు. హుజూరాబాద్‌లోని ఓ థియేటర్ వద్దకు హుజూరాబాద్ బీజేపీ నాయకులు వచ్చి సొంతడబ్బులతో టికెట్లు కొని పంచుతున్నారని, రజాకార్ల పాలనలో బీజేపీ లేదన్నారు. అప్పటి అఘాయిత్యాలను చిత్రీకరించి, ఇప్పుడు ముస్లింలను శత్రువులుగా చూపుతూ హిందువులను ఉసిగొల్పుతున్నారని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అంబేద్కర్ చౌరస్తా వద్ద శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దాసరి కనకయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి రవిశాస్త్రి, వడ్లూరి సిద్దు, తడగొండ మల్లేశం, సంపత్, రాజశేఖర్, శశికుమార్, చంద్రయ్య, అశోక్, రాజయ్య, మోహిత్, రాజు, మధురెడ్డి, దాసరి రాజేందర్‌రెడ్డి, రవి, నరసయ్య, పోచయ్య, నాగరాజు, పలువురు పాల్గొన్నారు.

పొదుపు సంఘం వార్షిక మహాసభ



లావాదేవీలపై చర్చిస్తున్న సంఘం సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలో మాధవ పురుషుల పొదుపు సంఘం పదో వార్షిక మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా పొదుపు సమితి అధ్యక్షుడు గోపు అజయ్‌కుమార్ సంఘం ద్వారా కలిగే ప్రయోజనాలు సభ్యులకు వివరించారు. అనంతరం లావాదేవీలపై చర్చించారు. ఇటీవల సంఘం సభ్యులు ఆరుగురు మృతిచెందగా వారి కుటుంబాలకు బీమా చెక్కులు అందించారు. కాగా సంఘం అధ్యక్షుడిగా తొర్రి రవి తిరిగి ఎంపికైనట్లు సమితి అధ్యక్షులు గోపు అజయ్‌కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొలిపాక కార్తీక్ రాజు, సభ్యులు ప్రవీణ్, పసుల స్వామి, అశోక్, మేకల మల్లయ్య, భరత్, రాజేంద్రప్రసాద్, నరేశ్, గణకుడు మహేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బీమా ప్రతినిధులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్‌గ్రామానికి చెందిన అనుమాండ్ల భాస్కర్‌రెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబానికి ఆదివారం ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తరఫున చేయూత అందించినట్లు కార్యాలయ మేనేజర్ సుధాకర్ తెలిపారు. భాస్కర్‌రెడ్డి ఎస్‌బీఐ లైఫ్‌లో పాలసీ చేసుకోగా మృతుడి భార్య అనుమాండ్ల సునీతకు రూ. 5 లక్షల చెక్కును అందించడంతో పాటు పాలసీకి సంబంధించిన మిగతా ఈఎంఐలను కంపెనీ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ఏజెన్సీ మేనేజర్ విష్ణువర్ధన్, అడ్వైజర్ మేకల అరవీందర్ తదితరులు ఉన్నారు.

ఉన్నదారి మూతపడింది!

- శ్మశానవాటికకు వెళ్లేదారి మధ్యలో నుంచి నేషనల్ హైవే
- అంత్యక్రియలకు ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



శ్మశానవాటిక వేళ్లే దారి మధ్యలో నుంచి నేషనల్ హైవే(ఇన్‌సెట్లో) శ్మశానవాటిక

మానకొండూర్‌రూరల్: నూతన జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జగిత్యాల- వరంగల్ ఎన్‌హెచ్ 563 పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నాలుగు వరుసల రోడ్డు పనుల్లో కొంత మంది భూములు కోల్పోయారు. గృహాలు నష్టపోయి, ప్రభుత్వం అందించిన ఆర్థికసాయంతో బాధితులు నిరుత్సాహంగా ఉన్నారు. రవాణాకు అనుగుణంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, రాబోయే రోజుల్లో రవాణాకు అనుకూలంగా రహదారులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అధికారులు, నాయకులు చెబుతున్నారు. కానీ రహదారి వెళ్తున్న చోట్ల దారులు మూతపడటంతో చాలామంది ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

మానకొండూర్‌లో..

మండల కేంద్రంలోని తూర్పుదర్వాజ నుంచి జమ్మికుంటవైపు వెళ్లేదారిలో అరకిలోమీటర్ దూరంలో ఓ కాలనీలో సుమారు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 200 కుటుంబాలు 45 ఏళ్లుగా జీవిస్తున్నారు. ఎవరైనా మృతిచెందితే కాలనీ సమీపంలోని శ్మశానవాటికకు ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ మీది నుంచి ఓ చిన్న బ్రిడ్జి ఏర్పాటు చేసుకొని అంత్యక్రియలను పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ 563 ఈమార్గం గుండా వెళ్తుండటంతో ఉన్న దారి కాస్తా మూతపడిపోయింది. దీంతో కాలనీలో ఎవరైనా మృతిచెందితే శ్మశాన వాటికకు వెళ్లడానికి దారిలేక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తిరిగి వెళ్లాల్సి వస్తోందని, పట్టాభూముల యజమానులు వారి స్థలంలో నుంచి నడవొద్దని అడ్డుకుంటున్నారని, అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలి



ఉన్నదారి గుండా రహదారి వెళ్తున్నందున శ్మశాన వాటికకు వెళ్లాలంటే దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాలనీవాసుల కోసం రహదారి గుండా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నాం.

– బి.రాజశేఖర్, మాజీ వార్డు మెంబర్

దారి ఏర్పాటు చేయాలి



రహదారి నిర్మాణంతో శ్మశాన వాటికకు ఉన్న రోడ్డు కాస్త పోయింది. ఎవరైనా మృతి చెందితే శ్మశాన వాటికకు వెళ్లాలంటే సొంత భూములు ఉన్నవారు నడవటానికి దారి ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు తక్షణం దారిని ఏర్పాటు చేయాలి.

– ఎ.లక్ష్మి, గృహిణి

పైపులైన్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామంలో అధికారులు పైపులైన్‌కు మరమ్మతు చేపట్టారు. 'గర్శకుర్తిలో తాగునీటికి తంటాలు' అనే శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఆదివారం పైపులైన్ మరమ్మతు చేపట్టారు. త్వరలో గ్రామానికి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.



పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న అధికారులు

వెదిరలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

రామడుగు: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా మండలంలోని వెదిర గ్రామానికి చెందిన నేరెళ్ల శారదఆంజనేయులుగౌడ్‌ను నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ వద్ద స్వీట్లు పంపిణీ చేసి, నియామకం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోనేపల్లి బాలాగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నేరెళ్ల మారుతిగౌడ్, గొల్లపల్లి అంజయ్య, రాల్లబండి సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

సైదాపూర్: మండల కేంద్రం వెన్కెపల్లి పొల్కమ్మ చెరువు మైదానంలో నిర్వహించిన గ్రేస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో అక్కన్నపేట మండలం జనగాం టీం విన్నర్ కాగా సైదాపూర్ మండలం శివరాంపల్లి టీం రన్నర్‌గా నిలిచింది. ముగింపు రోజు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హాజరై విన్నర్, రన్నర్ టీంలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, క్రీడాకారులు ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకుడు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నగరిగారి ప్రీతంను నియమించిన సందర్భంగా పట్టణానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆదివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. దళితులందరిని ఆర్థిక, సాంఘిక, విద్యాపరంగా అభివృద్ధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు దళితబంధు రెండో విడుత నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న మొలుగూరి సదయ్య

రజాకర్ సినిమాను వీక్షించిన నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అన్నపూర్ణ థియేటర్‌లో రజాకర్ సినిమాను ఆదివారం మధ్యాహ్నం బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... నిజాం, రజాకర్ల చరిత్రను, వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వాళ్లను సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపెట్టారని, తెలంగాణలోని ప్రతి ఒక్కరూ తప్పకుండా సినిమా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, కమలాపూర్ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు పైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్, మాసాడి ముత్యంరావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

బియ్యం అందజేత

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నేరెళ్లశ్రీనివాస్ ఇటీవలమృతి చెందగా పాడి కౌశిక్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు భోగం మురళి ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబానికి 25 కేజీలబియ్యం అందజేశారు. ఈకార్యక్రమంలో గొట్టెశేఖర్, భోగం సంతోష్, ప్రమోద్ కుమార్, గూడెపు కుమార్, జలపతిగౌడ్ పాల్గొన్నారు.



బియ్యం అందిస్తున్న సేవా సమితి సభ్యులు

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

సైదాపూర్: వెన్కెపల్లి–సైదాపూర్‌లో ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు ఏఈ ఆంజనేయులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. వెన్కెపల్లి–సైదాపూర్‌లో ఎస్ఎస్-19, సింగిల్ ఫేస్ 15 కేవీఏ ఓవర్ లోడ్ ఉన్నందున దాని స్థానంలో సింగిల్ ఫేస్ 25 కేవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని, ఇక నుంచి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తామని పేర్కొన్నారు.

నియామకం



శ్రీకాంత్‌గౌడ్



నర్సింగం

రామడుగు: బీజేపీ రామడుగు మండల ఉపాధ్యక్షుడిగా కాడె నర్సింగం, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, కార్యదర్శిగా వెల్మల రమేశ్ నియామకమయ్యారు. ఈమేరకు బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ పార్టీ వీణవంక అధ్యక్షుడు ఎవరో?

వీణవంక: హుజూరాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఇటీవల నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ రద్దు చేశారు. వారం రోజుల్లో కమిటీలను నియమించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. వీణవంక మండల అధ్యక్ష పదవి రెడ్డి సమాజిక వర్గానికి కేటాయించడంతో ఎవరికీ దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు, వల్భాపూర్ గ్రామానికి చెందిన ఎక్కటి రఘుపాల్ రెడ్డి ప్రధాన రేసులో ఉన్నట్లు తెలిసింది. నలుగురు నాయకులు పోటీలో ఉన్నా రఘుపాల్‌రెడ్డి వైపే ప్రణవ్ మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం. బీఆర్‌ఎస్ నుంచి వల్భాపూర్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మృదుస్వభావి, ప్రజలతో మంచి సంబంధాలు ఉండటంతో దాదాపుగా రఘుపాల్‌రెడ్డినే నియమిస్తారని, వారంలో అధికారిక ప్రకట వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

పద్మశాలి సంఘం కార్యవర్గం

కరీంనగర్: పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు ఆధ్వర్యంలో భాగ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో 56వ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేష్, గౌరవ అధ్యక్షుడిగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా మహేందర్, ఉపాధ్యక్షులుగా ఆనందం, ట్యాల సత్యనారాయణ, శంకర్, రాంప్రసాద్, కైలాసపతి, గౌరవ సలహాదారులుగా వెంకటేశ్వర్లు, వీరేశం, రామ్మోహన్, సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్, నర్సయ్య, భూమేష్, ఆంజనేయులు, గౌడ రమేశ్, నరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జగన్మోహన్, ప్రచార కార్యదర్శిగా జగదీష్ ఎన్నికయ్యారు. ఆంజనేయులు, కనకయ్య, చెంద్రశేఖర్, కనకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



చొప్పదండి: పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఐదేళ్లకోసారి జరిగే ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా మహిళలు నెత్తిన బోనాలతో ర్యాలీగా పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఎల్లమ్మ బోనాలు, బుధవారం పట్నాల కార్యక్రమం ఉంటుందని గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు ముద్దం మహేశ్‌గౌడ్, డైరెక్టర్లు, కుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం మేడివిజన్ కంటి ఆసుపత్రి సిబ్బంది ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి ప్రజలు, రిటైర్డు ఉద్యోగులు, జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన వారు హాజరై కంటిపరీక్షలు చేయించుకున్నారు. 102 మందికి పరీక్షలు చేయగా 9 మందికి కంటి ఆపరేషన్ అవసరమని వైద్యులు రెఫర్ చేశారు. వైద్యశిబిరంలో డాక్టర్ దీప్‌సింగ్, టెక్నీషియన్స్ వాసు, సంతోష్, ఆర్గనైజర్స్ ఉదయ్, ఖలీద్, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ పాషా, కార్యదర్శి గోపాల్ రావు, ప్రచార కార్యదర్శి జయవర్ధన్, ట్రెజరర్ దుర్గాజి, ఉపాధ్యక్షుడు గణపతిరెడ్డి, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, శ్రీహరి, కాంతమ్మ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పుస్తకావిష్కరణ

జమ్మికుంట: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందర్ పూర్వ ప్రధానాచార్యులు పూజారి సాంబయ్య రాసిన నా ఆలోచనానందాలు, అభిరుచులు అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పూర్వపు ప్రధానాచార్యులు సాంబయ్య సమాజంలో ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి అని అన్నారు. పుస్తకంలో మంచి విషయాలు పొందుపరిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల రాజేందర్, డాక్టర్ ముక్క రాజేశ్వరయ్య, చంద విశ్వనాథం, పూర్వ విద్యార్థులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పూర్వ విద్యార్థులు

తొలగించకపోతే అంతే..

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగి కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై పడిపోయాయి. కొమ్మలను తొలగించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని సంబంధిత అధికారులు స్పందించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



విద్యుత్ షాక్‌తో గేదె మృతి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి శివారులోని వ్యవసాయ భూమి వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ వైరు తెగిపోయింది. పిట్టల సంపత్‌కు చెందిన గేదె మేత కోసం వెళ్లిగా విద్యుత్ వైర్ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా కరెంట్ సరఫరా నిలిపివేశారు. మృతిచెందిన బర్రె విలువ రూ.86 వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కౌన్సిలర్ పిట్టల శ్వేతరమేష్, కాలనీవాసులు కోరారు.



మృతి చెందిన గేదెను చూపుతున్న బాధితుడు

పిడుగుపాటుకు ఆవు..

తిమ్మాపూర్: మండలంలోని మక్తపల్లెకు చెందిన పాలేటి వీరయ్యకి చెందిన ఆవు పిడుగుపాటుకు గురై మృతి చెందింది. వీరయ్య ఐదేళ్ల క్రితం దుబాయిలోని ఎడారిలో బందీకాగా గతంలో 'సాక్షి' కథనానికి అప్పటి మంత్రి కేటీఆర్ స్పందించి విదేశాంగ మంత్రితో మాట్లాడి సురక్షితంగా ఇండియాకు వచ్చేలా కృషి చేశారు. జీవనోపాధి కోసం ఐదేళ్ల నుంచి ఆవులను పెంచుకుంటున్నట్లు వీరయ్య తెలిపాడు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడటంతో చెట్టి కింద కట్టేసిన ఆవు మృతి చెందింది. మృతిచెందన ఆవు విలువ రూ. 70 వేలు ఉంటుందని వీరయ్య తెలిపారు. బాధితుడి కుటుంబానికి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గాండ్ల భాగ్యలక్ష్మి, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.



మృతిచెందిన ఆవు వద్ద వీరయ్య

సామాజిక సేవకుడు రవికుమార్‌కు సన్మానం



కరీంనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని హనుమకొండలోని జయ కృష్ణ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ఉత్తమ మహిళలు, సేవ, కళారంగాల్లో వివిధ సేవలు చేసినవారికి విస్డం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు మహిళలను సన్మానించి అవార్డుతో సత్కరించారు. కరీంనగర్ పట్టణానికి చెందిన పసుల రవికుమార్ చేస్తున్న సేవలను గుర్తించి విస్డం చారిటబుల్ అధ్యక్షుడు అనుమండ్ల నాగరాజు ఆహ్వానించి ఏసీబీ కె.విజయ్‌కుమార్ చేతుల మీదుగా సత్కరించారు. పద్మావతి టీవీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పసుల రవికుమార్ మాట్లాడుతూ.. ఈ సన్మానం మరింత బాధ్యత పెంచిందని, ఇంకా సేవలు ఇలాగే కొనసాగిస్తానన్నారు.